క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ఎం.విజయ్‌కుమార్ ప్రకటించారు. సుందర్‌నగర్ ఫీడర్ పరిధిలో దుర్గానగర్, డంపింగ్ యార్డు, పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, కృష్ణానగర్, ఆజాద్‌నగర్, అంబేద్కర్ కాలేజీ, వడ్డెరబస్తీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా హఫీజుద్దీన్ మహమ్మద్



సత్కరిస్తున్న శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుదర్శన్

కాచిగూడ: కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా హఫీజుద్దీన్ మహమ్మద్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గౌటే గణేష్‌లు ఆయనను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు.

సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు



యోగా చేస్తున్న విద్యార్థినీవిద్యార్థులు

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శిక్షణ తరగతులు ముగిశాయి. శుక్రవారం అనేక విభాగాల్లో శిక్షణ తరగతులు నిర్వహించగా.. కళ, క్రాఫ్ట్, అవుట్‌డోర్, ఇండోర్ గేమ్‌లు పిల్లల్లో ఉత్సాహాన్ని నింపాయి. ముగింపు వేడుకల్లో స్కూల్ కరస్పాండెంట్ కట్ట ప్రభాకర్, ప్రిన్సిపాల్ రామాంజుల ఫాతిమా కాజిమ్, బాలరాజ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

మంత్రికి ఆహ్వానం



చిక్కడపల్లి: నూతన గ్రంథాలయ భవన భూమిపూజకు రావాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు విడుదల చేస్తున్న క్రమంలో పోటీపరీక్షల అభ్యర్థుల సౌకర్యార్థం కొత్త పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న స్థానికులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని దాయర మార్కెట్, రాంనగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. శుక్రవారం ఎమ్మెల్యే కలుషిత తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టాలని జలమండలి అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠాజైసింహా, అరుణ్, సూర్యనారాయణ, మధు, వాసుదేవ్, సునీల్, భరత్‌నర్సింహ్మా, శ్రీధర్‌రెడ్డి, కాశీ, డీజీఎం మోహన్‌రాజ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

బీసీ కులవృత్తులకు పునరుజ్జీవం

కాచిగూడ: బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన రూ.లక్ష పథకంతో కులవృత్తుల పునరుజ్జీవం జరుగుతుందని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. శుక్రవారం కాచిగూడలో జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం అమలుకు రాష్ట్రప్రభుత్వం బీసీ కులసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కష్టకాలంలో ఉన్న బీసీలను ఆదుకునేలా సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రకటించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీదళ్ నేతలు అయ్యాన్, సాయియాదవ్, శ్రీను, అఖిల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గమే లక్ష్యం

- తిలక్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన
- హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కాలేరు



శివానంద్‌నగర్ సమీపంలో నాలా ప్రహరీ పనులను పరిశీలిస్తున్న దృశ్యం



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ నుంచి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ పెద్దగణేష్ మండపం సమీపంలోని ఆర్కేడీ అపార్ట్‌మెంట్ నుంచి గోల్నాక కల్లు కాంపౌండ్ వరకు రూ. 14.50 లక్షలతో డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాట్లాడారు. డ్రైనేజీ పైపులైన్లు చాలా వరకు శిథిలావస్థకు చేరడంతో పైపుల్లో లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమవుతోందన్నారు.

- నియోజకవర్గంలో నిత్యం పాదయాత్ర చేపడుతున్న క్రమంలో స్థానికులు ఈ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఆయా బస్తీలు, కాలనీలలో నూతన పైప్ లైన్ నిర్మాణం కోసం జలమండలి అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించామన్నారు.
- పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మరో రూ. 2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. జలమండలి అధికారులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

హుస్సేన్ సాగర్ నాలా నిర్మాణ పనుల పర్యవేక్షణ..

- శివానంద్‌నగర్‌లో జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల అధికారులు, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులను ప్రత్యేకంగా కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో రూ. 23 లక్షలతో చేపట్టిన నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అనంతరం శివానంద్‌నగర్‌ను ఆనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీలో ప్రమాదకర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు సమాచారం.

నేడు వాటర్ వార్క్స్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

నల్లకుంట: నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలో రూ.17.80 లక్షలతో నూతనంగా చేపట్టనున్న డ్రింకింగ్ వాటర్ పైపులైన్ నిర్మాణ పనులకు శనివారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకుస్థాపన చేస్తారని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వేగం కన్నా ప్రాణం మిన్న..



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న శంకర్‌రాజు

కవాడిగూడ: నగరంలోని ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సందర్భంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. వాహనాలు నడపాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట, హైదరాబాద్ శంకర్‌రాజు పిలుపునిచ్చారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని వాహనదారులకు అవగాహన కల్పించారు. యువత వాహనాలను అతివేగంతో ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

- ఒకరి వేగం వల్ల మరో కుటుంబం జీవితం నాశనం అవుతుందని వాహనదారులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. రహదారులపై వాహనదారులు క్రమ శిక్షణగా వ్యవహరించాలని పేర్కొన్నారు.
- కవాడిగూడ డివిజన్ దోమలగూడ సుదర్శన్ ఐ ఆసుపత్రి సిబ్బందితో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు.
- 18 ఏళ్లు నిండిన యువత డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు.
- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని వారితో ప్రతిజ్ఞ చేయించారు. బేగంపేట టీటీఐ స్టాఫ్ హెచ్‌సీ వీరమ్మ, కృష్ణ, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కవిత్వ అస్తిత్వ ప్రచారకుడు సురవరం ప్రతాపరెడ్డి



మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: తెలంగాణ కవిత్వ అస్తిత్వ ప్రచారకుడుగా ప్రతాపరెడ్డి పేరు పొందారని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కవులే లేరన్న వారికి కవితలు వెలుగులోకి తెచ్చిన గొప్ప సంపాదకులు సాహితీ అభిమాని సురవరం ప్రతాప్‌రెడ్డి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మారుమూల ప్రాంతం నుంచి జాతీయ రాజకీయ నాయకుల సరసన నిలిచే స్థాయికి సురవరం స్వయం కృషితో ఎదిగారని వివరించారు. కవి చిక్కరామదాసు, సంగీత గురువు మల్లాది ఉష, సంఘసేవకులు తోట శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనుల పర్యవేక్షణ



డిప్యూటీ ఇంజినీర్‌తో కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: స్టీల్‌బ్రిడ్జి కింద యూటర్న్, పాదచారుల దారి నిర్మాణ పనులను ప్రారంభించకపోవడంపై గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కార్పొరేటర్ పావనీవినయ్ ఆర్టీసీక్రాస్‌రోడ్డు నుంచి అశోక్‌నగర్ వరకు కొనసాగుతున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల అధికారులపై ఒత్తిడి తెచ్చి మంజూరు చేయించిన యూటర్న్, పాదచారుల దారి పనులు మొదలు పెట్టకపోవడంపై డిప్యూటీ ఇంజినీర్ సుదర్శన్, సిబ్బందిపై ఆమె మండిపడ్డారు. బ్రిడ్జి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించిన కార్పొరేటర్ బ్రిడ్జి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, ఆకుల సురేందర్, లక్ష్మణ్‌యాదవ్, సత్యం, స్థానికులు, దుకాణదారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీలు

నల్లకుంట: నగర పోలీస్ కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ఏర్పాటైన 11 శాంతి భద్రతల విభాగం పోలీస్ స్టేషన్‌లకు కొత్వాల్ సీవీ ఆనంద్ కొత్తగా బలగాన్ని కేటాయిస్తున్నారు. ఈ సమయంలో అన్ని పోలీస్ స్టేషన్‌లను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్‌నగర్ బాలాజీనగర్, అంబర్‌నగర్‌లను కొత్తగా ఏర్పడిన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చారు. దీంతో నల్లకుంట పోలీస్ స్టేషన్ కేటగిరి 'సీ' లోకి వచ్చింది. ప్రస్తుతం ఇక్కడి పీఎస్‌లో 79 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా.. అందులో ఇద్దరు ఎస్సైలతో పాటు మొత్తం 32 మంది సిబ్బందిని నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రావతరణ దినోత్సవం నేపథ్యంలో వచ్చే నెల 2 నుంచి ఈ కొత్త ఠాణాల్లో కేసుల నమోదు ప్రారంభం కానుంది.

- నల్లకుంట లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సై కాశయ్య ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు, ఎస్సై కె. ప్రసాద్‌ను నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ నగర కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మరో ముగ్గురు ఏఎస్సైలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లను వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది ఆయా పీఎస్‌లలో రిపోర్టింగ్ చేస్తే నల్లకుంట పీఎస్‌లో 47 మంది సిబ్బందితో పాటు మరి కొంత మంది హోం గార్డులు విధులు నిర్వహిస్తారు. భవిష్యత్తులో కొత్త సిబ్బంది నియామకం జరిగితే ఈ ఠాణాకు మరి కొంత మంది సిబ్బంది వచ్చే అవకాశం ఉంది. అటాచ్‌డ్‌గా ఉన్న ఎస్సై అంజయ్యకు ఇదే పోలీస్‌స్టేషన్‌లో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. అంతకు ముందే ఇక్కడ డీఐగా విధులు నిర్వహిస్తున్న కిషన్ అంబర్‌పేట ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు.

అంబర్‌పేట్ ఎస్సైల బదిలీలు

అంబర్‌పేట: అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. గత మూడేళ్లుగా సీనియర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మల్లేష్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఏడాది పాటు పనిచేస్తున్న ఎస్సై మధు ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా.. వారి స్థానంలో ఎస్‌బీ నుంచి శ్రీనివాస్ ఎస్సైగా రానున్నారు. సాధారణ బదిలీలో భాగంగా ఈ బదిలీలు జరిగినట్టు సమాచారం. ఇప్పటివరకు 6 మంది ఎస్సైలు పోలీస్‌స్టేషన్‌లో 5 మందే ఉండే అవకాశం ఉంది.

స్పాట్ అధ్యాపకులకు రెమ్యూనరేషన్ ఇవ్వాలని వినతి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇంటర్ స్పాట్ వాల్యూవేషన్ చేసినా.. అంతకు ముందు ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ నిర్వహించిన ఎగ్జామినర్స్‌కు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ.. తెలంగాణ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కమీషనర్ నవీన్‌మిట్టల్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంత వరకు పేపర్ వాల్యూవేషన్ చేసిన ఎగ్జామినర్స్‌కు పారితోషకం ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. దీనివల్ల ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంతో వివరించారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు వేసవి సెలవుల్లో జీతాలు ఉండవని ఇలాంటి పేపర్ వాల్యూవేషన్‌లో వచ్చిన డబ్బులతోనే వారి జీవనం గడుస్తుందన్నారు. ఫెడరేషన్ కన్వీనర్ విజయ్‌కుమార్ చందు తదితరులున్నారు.

అన్నమయ్య పురస్కారాల బహూకరణ



చిక్కడపల్లి: త్రినయన సాంస్కృతిక కళానిలయం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులకు అన్నమయ్య పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. ప్రతిభను ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. నిర్వాహకులు ప్రవీణ, శ్రావణ్‌కుమార్, శివకార్తీక్ శాస్త్రి తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: డివిజన్‌లో కలుషిత తాగునీటి సరఫరా సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం డివిజన్‌లోని ప్రజల ఫిర్యాదు మేరకు అహ్మద్‌నగర్, ఆకాష్‌నగర్, నరేంద్రనగర్ ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా సమస్యపై ఆయన పర్యటించి పరిశీలించారు. వేసవిలో కలుషిత నీటి సమస్య బెడద లేకుండా జలమండలి అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా ప్రజలు నేరుగా తనదృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జలమండలి సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి!



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని దాయరమార్కెట్‌లో డ్రైనేజీ, నీటి సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ కె.రవిచారి దృష్టికి తీసుకురాగా.. శుక్రవారం పర్యటించిన ఆయన జలమండలి డీజీఎం మోహన్‌రావుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. బీజేపీ నాయకులు గడ్డం నవీన్ తదితరులున్నారు.

నిరంకుశ పాలకులను గద్దె దించుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరామ్

ముషీరాబాద్: రాష్ట్రంలో నిరంకుశ పాలకులను గద్దె దించి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుదామని టీజేఎస్ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షులు నరసయ్య అధ్యక్షతన రాంనగర్ ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన హైదరాబాద్ ప్లీనరీ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో తెలంగాణ జన సమితి కీలకంగా మారనుందన్నారు. రాజకీయాల్లో మార్పుకోసం తనవంతు ప్రయత్నిస్తానని ఆయన వెల్లడించారు. నగరంలో అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి వాహనదారులను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ ప్రారంభానికి ముందు రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామ్‌నగర్ చౌరస్తా నుంచి సభావేదిక వద్దకు కోదండరాంతో సహా కార్యకర్తలు నాయకులు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రాంచందర్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, అంబర్‌పేట ఇన్‌చార్జ్ జస్వంత్, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రగిరి సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, యువజన సమితి రాష్ట్ర అధ్యక్షులు సలీంపాషా, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి అరుణ్‌కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, నగర యువజన సమితి అధ్యక్షులు సునీల్‌కుమార్, మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుష్పలత, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు కాకునూరి సుధాకర్, నగర సహాయ కార్యదర్శి జయపాల్‌రెడ్డి, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రవీందర్‌యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు అజయ్‌గౌడ్, ముషీరాబాద్ ఎస్సీసెల్ అధ్యక్షులు వెంకటయ్య, నగర నాయకులు లక్ష్మణ్, సురేష్, నగరంలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ ఉద్యమకారుడు, జర్నలిస్టు ఎం.నరసయ్య రెండోసారి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన హైదరాబాద్ ప్లీనరీ సభలో కోదండరామ్ ఆయన నియామకాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బట్టల రాంచందర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్‌లతో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గడపగడపకు బీజేపీ



చింతల రాంచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

కాచిగూడ: గడపగడపకు బీజేపీ జెండా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి హిమాయత్‌నగర్ డివిజన్ 18వ పోలింగ్ బూత్ గాంధీ కుటీర్‌లో నిర్వహించిన బూత్ దర్శన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా బీజేపీ గడపగడకు వెళ్తుందన్నారు. బీజేపీ ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, నర్సింగ్, తుల్జారామ్, కవిత తదితరులున్నారు.

విద్య, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం



డీవైఎఫ్ఐ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేద వర్గాలకు విద్యను దూరం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేస్తుందని దీనిలో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా, ఉపాధి, పర్యావరణ అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్రం విద్యారంగాన్ని విస్మరించిందని పేదలకు విద్యను దూరం చేసేందుకు అనేక మార్పులు చేస్తూ.. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. భవిష్యత్తు తరాలకు స్వాతంత్ర్య ఉద్యమ పోరాట చరిత్ర తెలియకుండా పాఠ్యపుస్తకాల నుంచి తొలగిస్తున్నారన్నారన్నారు. దేశ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం యువతను నిరుద్యోగులుగా మారుస్తోందని ఆరోపించారు. దేశంలో రోజు రోజుకు నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్నా.. ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. అందరికి విద్య, ఉపాధికై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు జావేద్, బషీరుద్దీన్, తిరుపతి, పఠాన్ రోషీనీన్‌ఖాన్ తదితరులున్నారు.

క్రీడాకారులకు టెన్నిస్ సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న కార్పొరేటర్ పద్మవెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: వేసవిలో విద్యార్థులు క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బాగ్‌అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలోని గ్రౌండ్‌లో క్రీడాకారులకు టెన్నిస్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఇతర అభిరుచులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రాజు, సత్యనారాయణ, కోచ్ కిరణ్ తదితరులున్నారు.

సాహసానికి మారుపేరు సినీహీరో కృష్ణ

చిక్కడపల్లి: సినీరంగం, నిజజీవితంలో సాహసాలు ప్రయోగాలకు మారుపేరు నటుడు కృష్ణ అని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో కళానిలయం ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సినీ హీరో కృష్ణ 80వ జయంతి వేడుకలను కృష్ణ అభిమాన సందోహం మధ్య సందడిగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. గూఢచారి కౌబాయ్ వంటి సినిమాలు తెలుగులో రావటానికి ఆయనే కారణమన్నారు. వారు నటించిన అల్లూరి సీతారామరాజు నాటికి నేటికి ఏనాటికీ సినీచరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించిన సభలో కృషి వ్యక్తిగత మేకప్ కళాకారుడు మాధవరావు, కృష్ణతో సినిమాలు నిర్మించిన శివనాగ్, బద్రీనాథ్‌లను సత్కరించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, దిడ్డిరాం బాబు, సురేష్‌గౌడ్ బాబ్జీ తదితరులున్నారు. సురేందర్, సాయిశ్రీ , మహేష్, విజయ్ శిష్యుల నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పలత వందన సమర్పణ చేశారు.